

డీఎస్పీల బదిలీ

శ్రీకాకుళం క్రైం, జూలై 31: జిల్లాలో పలువురు డీఎస్పీలకు బదిలీ అయింది. రాష్ట్ర వ్యాప్తంగా 96 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతిని పోలీసు హెడ్ క్వార్టర్స్‌కి రిపోర్ట్ చేయమని ఉత్తర్వులు వచ్చాయి. అలాగే కాశీబుగ్గ డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి, టెక్కలి డీఎస్పీ డి.బాలచంద్రరెడ్డిని, శ్రీకాకుళం ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ బి.విజయకుమార్‌కు కూడా బదిలీ అయింది. వీరిని కూడా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు రిపోర్ట్ చేయాల్సిందిగా డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

అన్న క్యాంటీన్లు సిద్ధం

- 15న ప్రారంభించేందుకు సన్నాహాలు
- జిల్లా కేంద్రంలో రెండు ఏర్పాటు

శ్రీకాకుళం అర్బన్, జూలై 31: పేదల ఆకలిని తీర్చేందుకు అన్న క్యాంటీన్‌లు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు వాటికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ నెల 15న వాటిని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 2014లో సీఎం నారా చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేశారు. 5 రూపాయలకే టిఫిన్, భోజనం అందించి పేదల ఆకలిని తీర్చారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను నిర్వీర్యం చేసింది. నిరుపేదల నోటికాడ కూడును లాగేసింది. అన్నక్యాంటీన్ భవనాలను వైసీపీ నేతలు తమ సొంత వ్యాపారాలకు వినియోగించుకున్నారు. వాటిని లీజు పద్ధతిలో తీసుకుని తమ జేబులు నింపేసుకున్నారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 100, జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో ఏడురోడ్ల కూడలి, పాతబస్టాండ్ వద్ద అన్న క్యాంటీన్‌లను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ భవనాలుకు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ నెల 15న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లాంఛనంగా అన్న క్యాంటీన్‌లను ప్రారంభించి నిరుపేదలకు చేరువచేయనున్నారు.



ఏడురోడ్ల కూడలిలో అన్న క్యాంటీన్



పాతబస్టాండ్ వద్ద..

టెక్కలి రోటరీనగర్‌లో దొంగలు పడ్డారు

- యజమానిని నెట్టి పరారీ
- 12 తులాల బంగారం, 200 గ్రాముల వెండి, రూ.3.50 లక్షల నగదు అపహరణ

టెక్కలి, జూలై 31: టెక్కలి మేజర్ పంచాయతీ రోటరీనగర్-1లో ఉపాధ్యాయుడు కర్రి వేణుగోపాలరావు ఇంట్లో మంగళవారం రాత్రి 1.00 గంట సమయంలో దొంగలు పడ్డారు. 12 తులాల బంగారం, 200 గ్రాముల వెండి, రూ.3.50 లక్షల నగదు అపహరించారు. ఇంట్లో నుంచి శబ్దం రావడంతో ఆయన పరుగున వచ్చినప్పటికీ దొంగలిద్దరూ నెట్టుకుని తప్పించుకున్నారు. ఘటనపై వేణుగోపాలరావు బుధవారం ఉదయం పోలీసులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన క్లూస్‌టీం వివరాలు సేకరించింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

వేణుగోపాలరావు ఎప్పటిలా పైఅంతస్తులోని ఓ గదిలో భార్య, కుమార్తెలతో పాటు నిద్రిస్తున్నారు. దొంగలు అర్ధరాత్రి 1.00 గంట సమయంలో తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాపై ఉన్న తాళాలు తీసి బీరువాలో ఉన్న 12 తులాల బంగారం, 200 గ్రాముల వెండి, రూ.3.50లక్షల నగదు దొంగిలించారు. ఇంట్లో ఇతర వస్తువులు చిందరవందర చేసి వెతుకుతుండగా శబ్దం రావడంతో అనుమానం వచ్చి వేణుగోపాలరావు పైగది నుంచి కిందకు వచ్చారు. చోరీకి పాల్పడిన ఒక వ్యక్తి గమనించి మొదటి అంతస్తు నుంచే కిందకు దూకేయగా, మరోవ్యక్తి వేణుగోపాలరావును నెట్టి జారుకున్నాడు. పరుగున కిందకు దిగి వెతికినా చోరుల ఆచూకీ తెలియలేదు. అలజడి విని చుట్టుపక్కల వారు లేచినప్పటికీ నిందితులు దొరకలేదు. వేణుగోపాలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ షైదయ్య కేసు నమోదుచేశారు. క్లూస్ టీమ్ బృందం వచ్చి వేలిముద్రలు, ఇతర వివరాలు సేకరించింది. ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఆ ప్రాంత సీసీ ఫుటేజ్‌ల ద్వారా గుర్తించామని సీఐ షైదయ్య తెలిపారు.



క్లూస్‌టీమ్ పరిశీలిస్తున్న దృశ్యం

రైతు సేవలో..

- వ్యవసాయశాఖ ప్రక్షాళనపై కూటమి ప్రభుత్వం దృష్టి
- రైతు సేవా కేంద్రాలతో అన్నదాతలకు మేలు
- పెట్టుబడి సాయం రూ.20వేలు ఇచ్చేందుకు సన్నాహాలు
- గత సర్కారులో రైతుల దరి చేరని పథకాలు



రైతు భరోసా కేంద్రం

(మెళియాపుట్టి)

పొలాల్లోకి ఐఏఎస్ అధికారులు సైతం వెళ్లి రైతుల సమస్యలు తెలుసుకొని పరిష్కారమార్గం చూపాలని ఇటీవల జరిగిన వ్యవసాయశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించిన విషయం తెలిసిందే. దీనిబట్టి వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో అర్థంచేసుకోవచ్చు. అదే వైసీపీ పాలనలో ప్రచారం చేసినంతగా రైతులకు సేవలు అందలేదు. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడి 40 రోజులు దాటక ముందే వ్యవసాయ రంగంలో ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మార్పులు తీసుకురావటంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం మట్టినమూనా పరీక్షలకు సైతం నిధులు మంజూరు చేయలేదు. దీంతో అంతంత మాత్రమే పరీక్షలు చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం నిధులు మంజూరు చేయడంతో అధికారులు మట్టినమూనా పరీక్షలు చేసి ఫలితాలను రైతులకు అందజేస్తున్నారు. గతంలో కేంద్రం ఇచ్చిన పీఎం కిసాన్‌తో కలిపి రైతు భరోసా పథకం కింద ప్రతి ఏడాది రైతులకు రూ.13,500 వరకు అందజేసేవారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతీ రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందజేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. రైతులకు గత సర్కారు పచ్చిరొట్ట విత్తనాలు, వ్యవసాయ పరికరాలను రాయితీపై ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం యాంత్రీకరణ సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన పరికరాలను రాయితీపై ఇస్తున్నట్లు ప్రకటించడంతో రైతులు సంతోషం పడుతున్నారు. గతంలో అరకొరగా ఇచ్చిన యాంత్రీకరణ పరికరాలు వైసీపీ నేతలకే దక్కాయి. దీనివల్ల రైతులకు ప్రయోజనం చేకూరలేదని ఫిర్యాదులు రావడంతో వాటిపైనా ప్రస్తుత ప్రభుత్వం దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో 656 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో 4,47,382 ఎకరాల్లో వరి సాగు జరుగుతుంది. సచివాలయాలతో సంబంధం లేకుండా వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్థక శాఖలు రైతు సేవా కేంద్రాల్లో పూర్తిగా అందుబాటులో ఉండేలా ప్రణాళికలు తయారు చేస్తున్నారు.

కియోస్కలు ఎందుకు ఇచ్చారో?

గత ప్రభుత్వం ఆర్‌బీకేల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాల కోసం కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసింది. ఒక్కో యంత్రం కోసం రూ.70 వేలు ఖర్చుచేశారు. జిల్లా వ్యాప్తంగా రూ.4.59 కోట్లు ఖర్చు చేసి ఈ యంత్రాలను ఏర్పాటు చేసినట్లు లెక్కలు చూపించారు. కానీ వీటితో గత ఐదేళ్లు రైతులకు ఎలాంటి ఉపయోగం కలగలేదు. అధికంగా గిరిజన ప్రాంతాల్లో ఆన్‌లైన్ సౌకర్యం లేక ఈ యంత్రాలు మూలకు చేరాయి. నిధులను కంపెనీలకు ఇవ్వటానికే ఈ యంత్రాలను గత సర్కారు తీసుకువచ్చినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వీటితో పాటు టీవీలు సైతం ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేశారు. ఈ టీవీల్లో పంటల సాగు, తెగుళ్లు, నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలను ప్రసారం చేయాల్సి ఉంది. కానీ, జగన్ బటన్ నొక్కినప్పుడు మాత్రమే టీవీలను ఆన్‌చేసి తరువాత ఆపేసేవారు. వీటివల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం కనిపించలేదు.

బిల్లులు ఇవ్వలేదు..

గత వైసీపీ ప్రభుత్వం సచివాలయాలతో పాటు రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. కానీ, సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆ భవనాల తాళాలను సంబంధిత కాంట్రాక్టర్లు అధికారులకు ఇవ్వలేదు. జిల్లాలో 656 ఆర్‌బీకేలకు గాను పట్టణ ప్రాంతాల్లో 12 ఉన్నాయి. 238 కేంద్రాల నిర్మాణాలు పూర్తవడంతో సిబ్బంది అందులో విధులు నిర్వహిస్తున్నారు. పనులు చేసినా బిల్లులు కాకపోవటంతో 40 కేంద్రాల తాళాలు కాంట్రాక్టర్లు ఇవ్వని పరిస్థితి ఉంది. 378 కేంద్రాలు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు తెలుపుతున్నారు.

సంతోషంగా ఉంది..



రైతు భరోసా కేంద్రం పేరును రైతు సేవా కేంద్రంగా మార్చడం సంతోషంగా ఉంది. రైతులకు భరోసా కనిపిస్తుంది. సమయానికి విత్తనాలు, ఎరువులు అందుతున్నాయి. సాగు చేయాలని అనిపిస్తుంది. **-భానోజీరావు, టీడీపీ నాయకుడు, మెళియాపుట్టి**

కౌలు రైతులకు మేలు..



కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కౌలు రైతుల కు కార్డులు గుర్తింపు ఇవ్వటంతో పాటు ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తున్నట్లు ప్రకటించటం ఆనందంగా ఉంది. కౌలు వ్యవసాయం చేసినా నష్టం రాదనే ధైర్యం కలుగుతుంది.

-గరివేష్, బంజిరు రైతు

చేయూతనిస్తాం..

కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతుసేవా కేంద్రాలుగా మార్పుచేసింది. ఈ కేంద్రాల ద్వారా రైతులకు అన్ని సేవలు అందిస్తాం. నష్టాలు రాకుండా వ్యవసాయంలో చేయూత ఇస్తాం. **-మధుబాబు, వ్యవసాయశాఖ ఏడీ**

- ఆశ్రమ పాఠశాలలో కంటపడిన 12 అడుగుల పాము
- వణికిపోయిన విద్యార్థులు
- చాకచక్యంగా పట్టుకున్న స్నేక్‌స్నాచర్

హడలెత్తించిన కింగ్‌కోబ్రా

మెళియాపుట్టి, జూలై 31: పెద్దమడి బాలుర రెసిడెన్సియల్ పాఠశాలలో బుధవారం ఉదయం తరగతులు ప్రారంభం అవుతున్న వేళ ఒక్కసారిగా అలజడి రేగింది. 12 అడుగుల కింగ్‌కోబ్రా పాము కంట పడడంతో విద్యార్థులు బెంబేలెత్తారు. భయంతో పరుగులు తీశారు. తరగతి గదులు విడిచి బయటకు వచ్చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ టి.ప్రసాదరావు కాశీబుగ్గలో ఉన్న ఈస్టెన్‌గార్డ్ వైల్డ్ లైఫ్ సొసైటి సభ్యుడు ఓంకార్ త్యాడికి సమాచారం అందించారు. అయన వెంటనే స్పందించి చాకచక్యంగా పామును బంధించడంతో పాటు సమీప ఆకులమ్మ మందిరం అడవుల్లో విడిచిపెట్టడంతో కథ సుఖాంతమైంది.

పెద్దమడి గురుకుల పాఠశాల కొండల మధ్య ఉంటుంది. పాములు ఈ ప్రాంతంలో సంచరిస్తూ విద్యార్థులను హడలెత్తించడం ఇక్కడ సాధారణమే. అయితే ఏకంగా భారీ కింగ్‌కోబ్రా తరగతి గదుల్లో ప్రవేశించడంతో భయపడ్డారు. తొలుత విద్యార్థులు, ఉపాధ్యాయులు సాధారణ జాతికి చెందిన నాగుపాముగా భావించారు. వైల్డ్‌లైఫ్ సభ్యులకు కూడా అదే సమాచారాన్ని ఇచ్చారు. ఇది భయంకరమైన కింగ్‌కోబ్రా అని వారు చెప్పడంతో అంతా పరుగులు తీశారు. పాములు పట్టడంలో పూర్తి శిక్షణ పొందిన ఓంకార్ తన వద్ద ఉన్న పరికరాలతో చాకచక్యంగా బంధించాడు. తొలుత ఓ సంచికి ప్లాస్టిక్ గొట్టం అమర్చి అందులో పాము వెళ్లేలా చేశారు. అనుకున్న విధంగానే కింగ్ కోబ్రా అతని వ్యూహానికి తలదించి అందులోకి ప్రవే శించగానే సంచిని మడి చారు. అనంతరం అటవీ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయుల సహకారంలో సమీపంలో ఉన్న ఆకులమ్మ కొండల వద్దఉన్న భారీ అటవీప్రాంతంలో దాన్ని విడిచి పెట్టారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ కింగ్‌కోబ్రాకు రెండేళ్ల వయసు ఉంటుందని, ఇంకా 21 అడుగుల వరకు పెరుగుతుందని, అడవుల్లో సంచరించే ఇటువంటి అరుదైన జీవులు అప్పుడప్పుడు సమీప గ్రామాల్లోకి తారాసపడుతుంటాయని ఓంకార్ విలేకర్లకు తెలిపారు.





పెద్దమడిలో ప్రవేశించిన కింగ్‌కోబ్రాను తరలించేందుకు పరిశీలిస్తున్న స్నాచర్

తహసీల్దార్లకు పోస్టింగులు

- విధుల్లో చేరిన 39 మంది

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికలకు ముందు జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు ఇటీవల మరోసారి జరిగిన బదిలీల్లో భాగంగా మళ్లీ సొంత జిల్లాకు వచ్చేశారు. వీరందరికీ పోస్టింగ్‌లు కేటాయిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం మొత్తం 39 మంది తహసీల్దార్లు వారికి కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరారు.

తహసీల్దార్ పేరు	విధులు నిర్వహించే స్థానం
బీడీవీ ప్రసాదరావు	మందస
వై.జోగారావు	లావేరు
వై.జయలక్ష్మి	కంచిలి
బీఎస్ఎస్ సత్యనారాయణ	కేఆర్ఆర్‌సీ (టెక్కలి)
ఎస్.షైమావతి	డీఏవో(పలాస-ఆర్డీవో)
బి.అప్పలస్వామి	సోంపేట
బి.పాపారావు	కొత్తూరు
ఎల్.మధుసూధన	సరుబుజ్జిలి
పి.సరోజని	కలెక్టరేట్, ఈ-సెక్షన్ సూపరింటెండెంట్
ఆర్.అప్పలరాజు	కోటబొమ్మాళి
ఎం.శ్రీకాంత్	జి.సిగడాం
బి.మురళీమోహనరావు	కవిటి
వైపీ పద్మావతి	ఎల్ఎన్‌పేట
జె.ఈశ్వరమ్మ	బూర్జ
కె.ప్రవల్లిక ప్రియ	కేఆర్ఆర్‌సీ తహసీల్దార్-శ్రీకాకుళం
ఎస్.దిలీప్ చక్రవర్తి	టెక్కలి
పి.వేణుగోపాలరావు	ప్రత్యేక తహసీల్దార్-ఎన్‌పీపీ కొవ్వాడ
టి.సత్యనారాయణ	నరసన్నపేట
ఎన్.హనుమంతురావు	మెళియాపుట్టి
బి.సత్యం	పలాస
కె.శ్రీరాములు	ప్రత్యేక తహసీల్దార్-గెయిల్
జి.లక్ష్మీనారాయణ	జలుమూరు
ఎ.సింహాచలం	ఎచ్చెర్ల
ఎస్.రమణారావు	గార
ఎస్.గణపతిరావు	శ్రీకాకుళం
జె.రామారావు	డీఏవో-శ్రీకాకుళం ఆర్డీవో
ఎస్.వెంకటరావు	ఇచ్ఛాపురం
ఎన్.రమేష్‌కుమార్	పొందూరు
బి.వెంకటరమణ	హిరమండలం
జి.ప్రభాకరరావు	డీఏవో-టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయం
కె.విజయలక్ష్మి	సారవకోట
పి.బాల	వజ్రపుకొత్తూరు
ఎస్.ప్రసాదరావు	రణస్థలం
డి.రామమూర్తి	కలెక్టరేట్ డి సెక్షన్ సూపరింటెండెంట్
జీఏ సూర్యనారాయణ	కలెక్టరేట్ ఏవో
బి.ప్రకాశరావు	కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్
ఎం.సురేష్‌కుమార్	పోలాకి
బి.రాజేశ్వరరావు	కలెక్టరేట్ సీ సెక్షన్ సూపరింటెండెంట్

నందిగాం గురుకులంలో కలకలం

- ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య
- కుటుంబ సభ్యుల అనుమానం
- న్యాయం చేయాలని దళిత సంఘాలు డిమాండ్



ప్రిన్సిపాల్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ బాలచంద్రారెడ్డి

నందిగాం, జూలై 31: నందిగాం అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో కలకలం రేగింది. గురుకులంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీ చదువుతున్న లిమ్మక అక్షిత మంగళవారం అర్ధరాత్రి సమయంలో బాత్రూమ్ కిటికీకి చున్నీకట్టి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతిపై కుటుంబసభ్యులు, బంధువులు, పలు దళిత సంఘాల ప్రతినిధులు అనుమానం వ్యక్తం చేస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి గురుకుల ప్రిన్సిపాల్ బి.దమయంతి, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తూరు మండలం పారాపురం దరి మహసింగి గ్రామానికి చెందిన లిమ్మక శ్రావణి, గిరి దంపతుల రెండో కుమార్తె అక్షిత గతనెల (జూలై) 24న నిర్వహించిన మిగులు సీట్ల కౌన్సిలింగ్‌లో సీఈసీలో చేరింది. అదే నెల 26న హోమ్‌సిక్‌తో ఇంటికి వెళ్లి 29న సోమవారం మధ్యాహ్నం తల్లిదండ్రులు తోడుతో గురుకులానికి చేరుకుంది. యథావిధిగా తరగతులకు హాజరవుతూ మంగళవారం నైట్ స్టడీ అవర్‌కు కూడా వచ్చి అందరితో పాటు నిద్రపోయింది. అయితే బుధవారం వేకువజామున విద్యార్థినులను సెక్యూరిటీ సిబ్బంది నిద్రలేపే సమయంలో ఆరో తరగతి విద్యార్థిని టాయిలెట్ కోసం వెళ్లగా అక్కడ కిటికీకి అక్షిత మృతదేహం వేలాడుతుండడాన్ని గమనించి సిబ్బందికి చెప్పింది. దీంతో వారు ప్రిన్సిపాల్‌కు తెలిపారు. పక్కనే ఉన్న ప్రిన్సిపాల్ అక్కడకు చేరుకొని అక్షిత ఆత్మహత్య విషయాన్ని గురుకుల ఉన్నతాధికారులు, నందిగాం ఎస్ఐ, ఇన్‌చార్జి తహసీల్దార్, విద్యార్థిని తల్లికి తెలియజేశారు. ఎస్ఐ మహ్మద్ అమీర్ అలీ అక్కడకు చేరుకొని క్లూస్‌టీమ్‌కు సమాచారం అందించారు. వారి పరిశీలన అనంతరం మృతదేహాన్ని టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

మృతదేహం తరలింపుపై అభ్యంతరం..

తల్లిదండ్రులు రాకుండా అక్షిత మృతదేహాన్ని పోలీసులు ఆసుపత్రికి తరలిస్తుండడంతో బంధువులతో పాటు దళితహక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈలోగా తల్లిదండ్రులు శ్రావణి, గిరి అక్కడకు చేరుకొని రోదిస్తూ తన కూతుర్ని తమకు ఇవ్వాలంటూ వేడుకోవడం అక్కడివారిని కలిచివేసింది. విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం అందించాలని పలు దళిత సంఘాల నాయకులు కె.గణేష్, బి.ప్రభాకరరావు, టి.తిరుపతిరావు, జె.జయరాం, ఎ.లోకనాథం కోరారు. టెక్కలి డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.భాగ్యలక్ష్మి, ఎంఈవో జి.నర్సింహులు, గురుకులాల పర్యవేక్షణ కమిటీ ప్రిన్సిపాల్స్ పి.శ్రీనివాసరావు, డి.దేవేంద్రరావు, పద్మజ తదితరులు సంఘటనపై ఆరాతీశారు. డీఎస్పీ బాలచంద్రారెడ్డి.. ప్రిన్సిపాల్‌తో పాటు బాలిక తల్లిదండ్రులతో చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు న్యాయం చేయాలని కోరగా పోస్టుమార్టం అనంతరం అన్ని విషయాలు తెలుస్తాయని వారికి తెలిపారు. అక్షిత మృతిపై ఆమె మేనమామలు హరీష్, రవీంద్రబాబు తదితరులు అనుమానం వ్యక్తంచేసి న్యాయం అందించాలని కోరారు. అక్షిత పదో తరగతి వరకు తెలుగు మీడియంలో చదివి ఇంటర్మీడియట్‌లో ఇంగ్లీష్ మీడియంలో చేరడంతోనే ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటుందని ఎస్ఐ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థిని మృతి విషయాన్ని తెలుసుకున్న ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ గురుకులాన్ని సందర్శించి అక్కడ ప్రాంతాన్ని పరిశీలించి ఆరాతీశారు. విద్యార్థిని తండ్రి గిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



అక్షిత (ఫైల్)



రోదిస్తున్న అక్షిత తల్లిదండ్రులు

తక్షణ విచారణకు కలెక్టర్ ఆదేశం..

కలెక్టరేట్: నందిగాం అంబేడ్కర్ గురుకులంలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యపై తక్షణ విచారణ చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్.. పలాస, టెక్కలి ఆర్డీవోలను ఆదేశించారు. అలాగే జిల్లా కోఆర్డినేటర్ బాలాజీ నాయక్ తక్షణం నందిగాం వెళ్లి గురుకుల పాఠశాలను సందర్శించి పరిస్థితులను సమీక్షించాలని స్పష్టం చేశారు. విద్యార్థినులు ధైర్యంగా ఉండాలని, అధైర్య పడవద్దని, సమస్యలుంటే ప్రిన్సిపాల్‌కు తెలియజేయాలన్నారు. సమస్యలుంటే టోల్‌ఫ్రీ నెంబరు 1098కు ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లాలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శ్రీకాకుళం • గురువారం • 1 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com

నా దగ్గర ఆధారాలు ఉన్నాయి..
లీగల్‌గానే వెళతా



హీరో రాజ్‌తరుణ్, లావణ్యల వివాదం బుధవారం కొత్త మలుపు తిరిగింది. రాజ్‌తరుణ్ హీరోగా నటించిన 'తిరగబడరా సామీ' చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ బుధవారం జరిగితే అక్కడికి లావణ్య వచ్చారు. ఆ చిత్ర కథనాయిక, ఈ వివాదానికి కేంద్ర బిందువు అయిన మాల్వీ మల్హోత్రా కూడా వచ్చారు. రాజ్‌తరుణ్, మాల్వీ ఇద్దరూ వైట్ డ్రస్‌లో ఉండడం గమనార్హం. రాజ్‌తరుణ్ వస్తున్నాడని తెలియగానే మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. 'నా సినిమా హిట్ అయినప్పుడు కూడా ఇంత మంది మీడియా సభ్యులు రాలేదు' అంటూ రాజ్‌తరుణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తనపై వచ్చిన వివాదం గురించి ఆ మీడియా సమావేశంలో రాజ్‌తరుణ్ చెప్పిన మాటలు ఇవి.

- నాలో ఉన్న అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకుంటున్నారు. నేను ఎవరికీ వ్యతిరేకంగా మాట్లాడడం లేదు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. నా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. అందుకే లీగల్‌గా వెళుతున్నాను.
- నా వల్ల గర్భం వచ్చిందనీ, అబార్షన్ చేయించానని ఆరోపిస్తున్నారు. మరి ఆ విషయాన్ని పోలీసులకు ఇచ్చిన కంప్లయింటులో ఎందుకు చేర్చలేదు? ఎందుకంటే అవి నిజాలు కావు కనుక. అందుకే ఈ విషయం గురించి నేను మాట్లాడను. మా లాయర్ ద్వారా ప్రొసీడ్ అవుతున్నా.
- నాకు ఇప్పుడు 32 ఏళ్లు. ఇన్నేళ్ల జీవితంలో ఎందరో పరిచయం అయి ఉంటారు. ఎంతో మందితో సాన్నిహిత్యం ఉంది. వాళ్లలో ఎవరైనా నేను మంచి వాడిని కాదు అని చెబితే పరిశ్రమ నుంచి తప్పుకొంటా.
- నేనూ మనిషినే. బాధలు ఉండవా! ఆ బాధ వల్లే 'పురుషోత్తముడు' చిత్రం ఫంక్షన్‌కు కూడా రాలేదు. ఆ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు.
- నాకు పెళ్లి మీద ఆసక్తి లేదు. అది ఇప్పుడు చెబుతున్న మాట కాదు. నా పాత ఇంటర్వ్యూలు చూస్తే అది మీకు తెలుస్తుంది.
- 'తిరగబడరా సామి' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. రవికుమార్ చౌదరి దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించారు. ఫ్యామిలీ అంతా చూడదగ్గ సినిమా ఇదనీ, మాల్వీ మల్హోత్రా మంచి నటి అనీ, ఆమెకు ఇదే తొలి సినిమా కనుక ఆదరించండి.

లావణ్య ప్రత్యక్షం



తనకు కనిపించకుండా తిరుగుతున్న రాజ్‌తరుణ్ ప్రసాద్ ల్యాబ్‌లో ఉన్నారని తెలియగానే లావణ్య అక్కడ ప్రత్యక్షమయ్యారు. రాజ్‌తరుణ్ కలుసుకోవాలని ఆమె చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కొంతమంది మీడియా ప్రతినిధులు ఆమెతో మాట్లాడాలని ప్రయత్నించినా అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు లావణ్యను అక్కడ నుంచి పంపించేశారు. ఆ తర్వాత ఆమె మాదాపూర్‌లోని రాజ్‌తరుణ్ ఇంటికి చేరుకొని అక్కడ కూడా ఆందోళనకు దిగారు. తలుపు తీసే వరకూ అక్కడ నుంచి వెళ్లనని అన్నారు. రాజ్‌తరుణ్ అడిగిన ఆధారాలు తెచ్చినట్లు చెప్పారు.



కట్టి పడేసే కియారా



రామ్‌చరణ్ హీరోగా తమిళ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో కియారా అడ్వాణి కథానాయిక. బుధవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా లుక్ పోస్టర్ విడుదల చేశారు. చూపు తిప్పుకోవడం కష్టం అనేంతగా ఉన్న కియారా గ్లామర్ లుక్ అభిమానుల్ని కట్టి పడేస్తోంది.

'గద్దర్ అవార్డ్స్‌'పై కమిటీ ఏర్పాటు

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫిల్మ్ అవార్డ్స్ ను ఇకపై 'గద్దర్' అవార్డ్స్ పేరుతో ఇవ్వడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించడంపై తెలుగు చిత్ర పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'నటుడిగా, గాయకుడిగా ఎంతో ప్రతిభ కలిగిన వ్యక్తి గద్దర్. ఆయన పేరు మీద అవార్డులు ఇవ్వాలనుకోవడం సముచిత నిర్ణయం. ఈ అవార్డుల విధివిధానాలు ఎలా ఉండాలో తయారు చేయడానికి తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలుగు నిర్మాతల మండలి ఓ కమిటీని నియమిస్తాయి. ఆ విధి విధానాలను ఎఫ్.డి.సి. ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారికి త్వరలో అందజేస్తాం' అని తెలుగు చిత్ర పరిశ్రమ ఒక ప్రకటనలో తెలిపింది.

ఫ్యామిలీ డ్రామా



కృష్ణవంశీ, మోక్ష జంటగా నటించిన 'అలనాటి రామచంద్రుడు' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. చిలుకూరి ఆకాశ్‌రెడ్డి దర్శకుడు. హైమవతి, శ్రీరామ్ జడపోలు నిర్మాతలు. ఈ సినిమా నచ్చడంతో దిల్ రాజు విడుదల చేస్తున్నారు. ఫీల్‌గుడ్ ఫ్యామిలీ డ్రామా ఇదనీ, కథ అనుకున్నప్పుడే కొత్త వాళ్లతో తీయాలని అనుకున్నామనీ దర్శకుడు చెప్పారు. ఈ జనరేషన్‌కు కావాల్సిన స్వచ్ఛమైన ప్రేమను చిత్రంలో చూపించామనీ, కొత్త టాలెంట్‌తో సినిమా తీశామని నిర్మాతలు చెప్పారు.

బడ్డీనే హీరో



అల్లు శిరీష్ హీరోగా నటించిన 'బడ్డీ' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. జ్ఞానవేల్ రాజా, అధన నిర్మాతలు. శామ్ ఆంటోన్ దర్శకుడు. బుధవారం జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో అల్లు శిరీష్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను సెకండ్ హీరో. టెడ్డీ బేర్ ఫస్ట్ హీరో. టెడ్డీ చేసే యాక్షన్ సీన్లు అలరిస్తాయి' అని చెప్పారు. ఈ సినిమా విషయంలో నిర్మాత హ్యాపీగా ఉన్నారనీ, టీమ్ కూడా సంతోషంగా ఉందని దర్శకుడు చెప్పారు.

థ్రిల్లింగ్ అంశాలతో



నా గత చిత్రాలకు మల్లే 'శివం భజే' సినిమాలోనూ ఓ కొత్త థ్రిల్లింగ్ అంశాన్ని చూపించబోతున్నాం అని హీరో అశ్విన్ బాబు అన్నారు. ఆయన హీరోగా అప్సర్ దర్శకత్వం వహించిన చిత్రమిది. నేడు విడుదలవుతున్న సందర్భంగా అశ్విన్‌బాబు మీడియాతో ముచ్చటించారు. 'ఇందులో కుటుంబ అనుబంధాలతో పాటు ఆధ్యాత్మిక అంశాలను స్పృశించాం. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అని బలంగా నమ్మే పాత్ర నాది. ఇందులో యాక్షన్ స్టైలీష్‌గా ఉంటుంది' అని ఆయన చెప్పారు.

కీర్తి కామెడీ



కీర్తిసురేశ్ లీడ్‌రోల్ పోషిస్తున్న మహిళా ప్రాధాన్య చిత్రం 'రఘుతాత'. సుమన్ కుమార్ దర్శకుడు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. గడుసైన యువతి పాత్రలో కీర్తి కామెడీ పండించిన తీరు ఆకట్టుకుంది. హోంబలే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది.

తుపాన్ లాంటి యాక్షన్



విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'తుపాన్' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్ బోరా, లలిత, ప్రదీప్, పంకజ్ బోరా నిర్మించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ ఆంటోని మాట్లాడుతూ "బిచ్చగాడు' తర్వాత నా మనసుకు దగ్గరైన కథ ఇది. ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది. యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకుంటాయి. తెలుగు ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం యూనిట్ చాలా కష్టపడింది. విజయ్ ఆంటోని ఇందులో సరికొత్తగా కనిపిస్తారు. వినోదం,యాక్షన్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.









విద్యారంగ అభివృద్ధికి సీఎం ప్రాధాన్యం

- వైసీపీ ప్రభుత్వంలో పాఠ్య పుస్తకాల పంపిణీ నిలిపివేత
- కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరణ
- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ప్రియాగ్రహారం(పోలాకి): రాష్ట్రంలో విద్యారంగ అభి వృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల కిట్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. గతంలో టీడీపీ హయాంలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశామని, అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత నిలిపి వేసిందన్నారు. తిరిగి కూటమి ప్రభు త్వం పాఠ్యపుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తోందని, దీనిని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. పాఠ్యపుస్తకాల పంపిణీతో విద్యార్థులు ఆనందంగా ఉన్నారన్నారు. ఇంటర్ కళాశాలల్లో 'నాడు-నేడు' పనులు నిలిచిపోయాయాయని, వాటికి నిధులు విడుదల చేసి పనుల పూర్తికి ఇంటర్‌బోర్డ్, విద్యాశాఖలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయన్నారు. బాగా చదువుకుని కళాశాలలకు పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రియాగ్రహారం, పోలాకి ప్రిన్సిపాళ్లు ఎస్.ఎస్.ఎస్ నాగ కుమారి, గోవిందరావు, టీడీపీ నేతలు రోణంకి కృష్ణంనాయుడు, తమ్మినాన భూషణ రావు, సూరపు నారాయణదాస్, లావేటి కృష్ణారావు, ఎంవీ నాయుడు, బైరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. ప్రియాగ్రహారం కళాశాలలోని సమస్యలను మాజీ సర్పంచ్ లావేటి కృష్ణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. దశలవారీగా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి అచ్చెన్నాయుడు



సమస్యలను వింటున్న అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తా మని, అందరూ సంయ మనం పాటించాలని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు అన్నారు. బుధవారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రం భ్రష్టు పట్టుకు పోయిందని, దానిని గాడిలో పెట్టి అన్ని శాఖలు, వ్యవస్థలను ఒక తాటిపైకి తీసుకువచ్చి ప్రజా సమస్యల పరిష్కారం వైపు పయనిస్తామ న్నారు. కార్యకర్తలెవరూ నిరాశ, నిస్పృహలకు గురికావద్దన్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టి నెల రోజులే అయిందని, దానిని మరిచి కొంతమంది పథకాలు అమలు విషయమై విమర్శలు చేస్తు న్నారని, అవేవీ పట్టించుకోవద్దన్నారు. కార్యక్రమంలో జిల్లా నలు మూలలనుంచి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ సమస్యలు విన్నవించుకున్నారు.

సుడా లేఅవుట్‌తో పలాసకు మహర్దశ

- ఎమ్మెల్యే గౌతు శిరీష



సుడా లేఅవుట్ ప్లాన్‌ను ఎమ్మెల్యే శిరీషకు వివరిస్తున్న అధికారులు

పలాస, జూలై 31: సుడా లేఅవుట్ ఏర్పాటుతో పలాసకు మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం ఆమె జాతీయ రహదారి బొడ్డపాడు రెవెన్యూ ప్రాంతంలో సుడా ఆధ్వర్యంలో 150 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న టౌన్‌షిప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో టౌన్‌షిప్ ఏర్పాటవుతుండడం ఆనందంగా ఉందన్నారు. సామాన్య మధ్య తరగతుల వారికి అందుబాటు ధరల్లో విక్రయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. లాటరీ పద్ధతిలో ఫ్లాట్లు కేటాయిస్తారని, వాటి వివరాలు ఆన్‌లైన్‌లో పొందు పరుస్తారన్నారు. అనంతరం లేఅవుట్ ప్లాన్‌ను పరిశీలించారు. త్వరతగతిన దీనిని ప్రజలకు అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సుడా వైస్ చైర్మన్ ఓబులేసు, ప్లానింగ్ అధికారి టీజీ రామ్మోహన్, జిల్లా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి కిశోర్ కుమార్, పబ్లిక్‌హెల్త్ ఈఈ సుగుణాకర్, టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, కొర్ల కన్నారావు, టంకాల రవిశంకర్ గుప్తా, బడ్డ నాగరాజు, గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్, దడియాల నర్సింహులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల పరిశీలన



అక్రమణ స్థలంలో నిర్మించిన షెడ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పలాసరూరల్: టెక్కలిపట్నం గ్రామానికి చెందని లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ భూముల్లో తాత్కాలిక షెడ్ల నిర్మాణం, పునాదుల నిర్మాణాన్ని దేవదాయ శాఖాధికారులు పరిశీలించారు. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం "హే.. నర్సింహా..' శీర్షికతో వచ్చిన కథనానికి సం బంధిత అధికారులు స్పందించారు. ఏసీ ప్రసాద్ పట్నాయక్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ ప్రసాదబాబు, ఈవో వాసు దేవరావు, సిబ్బంది సదరు నిర్మాణాలను పరిశీలించారు. తక్షణం ఆక్రమణలను తొలగించాలని, లేకుంటే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దేవా లయ భూములు ఆక్రమణలు జరిగితే అర్చకులు సమాచారాన్ని అధికారులకు అందించాలని సూచించారు.

సహారా డిపాజిట్లు చెల్లించాలి

కాశీబుగ్గ: సహారా ఖాతాదారులకు 12 ఏళ్ల నుంచి డిపాజిట్లు సొమ్ము నిలిపివేశారని, తక్షణం వాటిని చెల్లించాలని సహారా కస్టమర్స్, ఫీల్డ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతి నిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కాశీబుగ్గ సహారా కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. శ్రీకాకుళం రీజియన్ పరిధిలో సుమారు రూ.500 కోట్లు ఖాతాదారులకు చెల్లించాల్సి ఉందన్నారు. తగు చర్యలు తీసుకుని ఖాతాదారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ అధ్యక్షుడు బైపల్లి సత్యరాజు, సభ్యులు బోయిన సత్యనారాయణ, సూర్యారావు, వరప్రసాద్‌రావు, శ్రీనివాసరావు, బాబురావు, చింతాడ మాధవరావు, మోహన్‌రావు, హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న పుచ్చ ఈశ్వరరావు

వజ్రపుకొత్తూరు: ఉమ్మడి ప్రభుత్వంలో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు గోవిందపురం పీహెచ్‌సీ మాజీ చైర్మన్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పుచ్చ ఈశ్వరరావు అన్నారు. బుధ వారం గోవిందపురం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యయపుస్తకాలు, నోట్ బుక్స్‌ను ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ.. ప్రైవేటు కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నేత కర్ని రమణ, మాజీ సర్పంచ్ సీపాన గోపి, రమణమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాలిబాటలతో అధిక దిగుబడులు

జలుమూరు (సారవకోట): వరి సాగులో కాలిబాటలు తీసి అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి కేసీహెచ్ వెంకటరావు అన్నారు. వడ్డినవలస లో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. అభ్యుదయ రైతు రామ్మోహన్ పొలంలో కాలిబాటలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వరి సాగులో కాలిబాటలు ఏర్పాటు చేయడం వల్ల మొక్కకు గాలి, వెలుతురు తగిలి అధిక పిలకలు వస్తాయన్నారు. చీడపీడలు రాకుండా ఉంటాయన్నారు. పొలంలో తూర్పు, పడమర దిశలుగా కాలిబాటలు తీసుకోవాలన్నారు. వరికి సస్యరక్షణ పనులు చేపట్టేందుకు, ఎరువులు వేసేందుకు, పురుగు మందుల పిచికారీకి కాలిబాటలు దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు కంఠయ్య, మంజులత, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎంఈవో అప్పలరాజు సేవలు అభినందనీయం



అప్పలరాజును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండల విద్యాశాఖాధికారి-1గా పని చేసిన సంపతిరావు అప్పల రాజు సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. బుధవారం ఉద్యోగ విరమణ చేసిన అప్పల రాజు దంపతులను ఎంఈవో, ఎంపీడీవో, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, బంధువులు సత్కరించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ లక్ష్యాలను నెరవేర్చడం, విద్యారంగ అభివృద్ధికి ఆయన విశేషంగా సేవలందించారన్నారు. ఉద్యోగ విరామణ తరువాత కూడా తమ సూచనలు సలహాలు ఇస్తూ ఉద్యోగుల సమస్యలపై ప్రోత్సాహం అందించాలని పలువురు ఉపాధ్యాయ సంఘ నేతలు కోరారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, నేతలు పాల్గొన్నారు.

మూగ మహిళపై వేధింపులు

- దాడి చేసిన కుటుంబ సభ్యులపై కేసు నమోదు

పాతపట్నం: పట్టణానికి చెందిన మూగ మహిళ మజ్జి పుష్పలతను వేధిస్తూ.. దాడికి పాల్ప డిన కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ నల్లి సాయి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బాధితురాలు తన పిల్లలతో పట్టణంలోని ఓ కాలనీలో మేడపై నివసి స్తోంది. ఈనెల 25న తన ఇంటి మేడపై నుంచి కిందకి ఉల్లిపాయల తొక్కలు పడ్డాయన్న నెపంతో ఎచ్చెర్ల గోపాల్, ఈశ్వరమ్మ, రోజా, పుష్పలత ఇంట్లో ప్రవేశించి దాడి చేయడంతో బాధితు రాలు, ఇతర కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు వారిని పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. మరలా మంగళవారం రాత్రి కూడా వారు దాడికి పాల్పడడంతో బాధి తురాలు స్టేషన్‌ను ఆశ్రయించారు. బుధవారం ఉదయం నుంచి దర్యాప్తు చేపట్టామంటూ మరలా పిలిపిస్తా మంటూ కౌన్సెలింగ్ చేసే ప్రయత్నం చేశారు. అయితే ఇంటి కెళ్లాలంటేనే భయమే స్తోందని ఆమె సైగలు చేసింది. దాడికి పాల్పడిన వారితో పోలీసులు లాలూచీ పడుతున్నారనే ఆరోపణలతో బుధవారం రాత్రి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి తనకు రక్షణ కల్పించాలని కోరింది. బాధితురాలి సోదరి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఎచ్చెర్ల గోపాల్, ఈశ్వరమ్మ, రోజాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ నల్లి సాయి తెలిపారు.

ఉరి వేసుకుని గిరిజనుడి ఆత్మహత్య



ప్రసాదరావు (ఫైల్)

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పెంటిభద్ర గ్రామానికి చెందిన సవర ప్రసాదరావు (34) అనే గిరిజనుడు బుధవారం రాత్రి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. చెందాడు. మృతుడు మాజీ కౌన్సిలర్ సవర పాలేసు కుమారుడు. మృతుడికి భార్య యమున ఇద్దరు పిల్లలున్నారు. ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు. కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విప్లవ వీరుడు ఉద్ధమ్ సింగ్

పలాసరూరల్: స్వాతంత్ర్య భారతావనిని కోరుకుంటూ ఎందరో ప్రాణత్యాగాలు చేశారని, వారిలో ఉద్ధమ్ సింగ్ ఒకరని, వారి త్యాగాలను స్మరించుకోవడం అందరి కర్తవ్యమని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వర్లు అన్నారు. మాకన్నపల్లి గ్రామంలో భగత్ సింగ్, రాజగురు విగ్రహాల వద్ద బుధవారం విప్లవవీరుడు కామ్రేడ్ ఉద్ధమ్‌సింగ్ 84వ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1919లో జరిగిన జలియన్ వాలా భాగ్ ఘటనలో ఎందరో ప్రాణాలను హరించిన డయ్యర్‌ను చంపేందుకు ప్రాణాలను లెక్క చేయకుండా ఇంగ్లాండ్‌లో విద్యార్థిగా ఉంటూ ఆయనను హత్య చేసి భారత మాత రుణం తీర్చు కున్న విప్లవత్యాగి ఉద్దమ్‌సింగ్ అని అన్నారు. కార్యక్రమంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ జిల్లా నాయకులు పి.దానేసు, రాపాక చిరంజీవి, ఆర్.భీమారావు, వీరాస్వామి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.లత

నరసన్నపేట: విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.లత అన్నారు. బుధవారం కళాశాలలో బీసీడీఈ (బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యూకేషన్) లో భాగంగా సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. పర్యావరణ, పరిశుభ్రత, ఇంటి ఆవరణలో శుభ్రతను వివరించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తికి కారణాలు, నివారణ మార్గాలను మాకివలస పీహెచ్‌సీ వైద్యులు శిరీష వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంగ్యూ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పలాస: డెంగ్యూ వ్యాధి సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి కోరారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డెంగ్యూ, మలేరియా జ్వరా లపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫిలిప్పీన్స్ దేశంలో హౌస్‌సర్జన్‌గా శిక్షణ పొందుతున్న జూనియర్ వైద్యుడు పి.శివమ్ మధు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీ మధు, వైస్‌ప్రిన్సిపాల్ గణపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీవో 85పై ప్రభుత్వం పునరాలోచన చేయాలి



ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు వినతిపత్రం అందిస్తున్న ప్రభుత్వ వైద్యులు

మెళియాపుట్టి/పాతపట్నం: ప్రభుత్వ వైద్యులు పీజీ ప్రవేశానికి ఇన్ సర్వీస్ కోటా తగ్గిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 85పై పునరాలోచన చేయాలని పీహెచ్‌సీల వైద్యులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును కలిసి వినతిపత్రం అందిం చారు. ఈ జీవో వల్ల ప్రభుత్వ వైద్యులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయాన్ని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. జీవో 85 రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని వైద్యులు తెలిపారు.

ప్రజాపంపిణీపై ప్రజాభిప్రాయ సేకరణ

కోటబొమ్మాళి: కలెక్టర్ ఆదేశాల మేరకు పీడీఎఫ్ బియ్యం పంపిణీ విధానంపై బుధవారం సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ కె.రాము ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలు, పౌరసరఫరాల డీలర్లు, విద్యాశాఖాధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఎండీయూ ఆపరేటర్లను కలిసి అభిప్రాయాలను సేకరించారు. ఈ విధానంలో నాణ్యత ప్రమాణాలు, తుకం తదితర అంశాలపై వివరాలను సేకరించారు.

ఆదాయ పన్ను చట్టాలపై అవగాహన

టెక్కలి: ఆదాయం పన్ను పరిధిలోకి వచ్చే ఉద్యోగులు అవగాహన కల్పించుకోవాలని జిల్లా ఆదాయపు పన్ను శాఖ అధికారి కె.రవిశంకర్ అన్నారు. బుధవారం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశా లలో బోధనా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదా య పన్ను పరిధిలోకి వచ్చిన ప్రతి ఉద్యోగి ఆదాయ వనరులను తెలియజేసే సంబంధిత దర ఖాస్తు ద్వారా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రవితేజ, డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, సీఏవో ఎన్.నర్సింహ రాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీని 5 గంటలకే ప్రారంభించాలి

పాతపట్నం: ప్రభుత్వం మంజూరు చేసిన సామాజిక పింఛన్లను గురువారం ఉదయం 5 గంటలకే పంపిణీ ప్రారంభించాలని ఎంపీడీవో కె.రామకృష్ణ రాజు కోరారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా వృద్ధాప్య, వితంతు లబ్ధిదారులు 9997 మంది ఉన్నారని, వీరికోసం రూ. 4,12,35,000 విడుదల చేయడం జరిగిందన్నారు. ● **నరసన్నపేట:** మండలంలో గురువారం ఉదయం 5.30 గంటల నుంచి సామాజిక పింఛన్లను పంపిణీ చేపడుతున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. బుధవారం పింఛన్ల పంపిణీ పై అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలాన్ని 393 క్లస్టర్లుగా విభజించి 223 మంది సిబ్బందితో 10,695 మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తారన్నారు. దీని నిమిత్తం రూ.4.37 కోట్లు అందజేశామన్నారు. ఐదుగురు అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు.

మెడ్‌పేస్‌కి సెంచూరియన్ విద్యార్థి ఎంపిక

ఒడిశా



నవాజ్

పర్లాకిమిడి, జూలై 31: పర్లాకిమిడి సెంచూరియన్ విద్యా సంస్థల్లో బీటెక్ ఫైటో ఫార్మస్యూటికల్స్ పూర్తి చేసిన ఆనాం నవాజ్ యునైటెడ్ కింగ్‌డమ్‌కి చెందిన మెడ్‌పేస్ సంస్థలో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా ఎంపికయ్యారని సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఉపాధ్య క్షుడు ప్రొఫెసర్, డాక్టర్ డీఎన్ రావు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. రూ.54 లక్షల వార్షిక వేతనంతో ఆ సంస్థ ఎంపిక చేసింద న్నారు. ఇంత మొత్తంలో వేతనం పొందిన మొదటి విద్యార్థిగా నవాజ్ గుర్తిం పు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా నవాజ్‌ను రిజిస్ట్రార్ అనితా పాత్రో, సిబ్బంది అభినందించారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు: సుప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలోని శ్రీ ముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆషాఢ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని అర్చకులు స్వామికి ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. సాయంత్రం స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకిలో వేంచేపు చేసి తిరువీధి నిర్వహించారు. గ్రామోత్సవంలో ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు నారాయణమూర్తి, సింహాచలం, శ్రీకృష్ణ, చైతన్య, శివ, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపోలవలస సర్పంచ్‌గా ప్రభాకరరావు

నరసన్నపేట, జూలై 31: కొత్తపోలవలస గ్రామపంచాయతీ సర్పంచ్‌గా పట్ట ప్రభాకరరావు నియమిస్తూ డీపీవో నియామక పత్రం అందజేసినట్లు ఎంపీడీవో రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సర్పంచ్ శ్యామలరావు మిస్సింగ్ కావడంతో ఉప సర్పంచ్‌గా ఉన్న ప్రభాకరరావును సర్పంచ్‌గా నియమిస్తూ ఈ ఉత్తర్వులిచ్చినట్లు పేర్కొన్నారు.

ఎర్రన్నాయుడు పార్కు పరిశీలన



ఫౌంటైన్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు, అధికారులు

టెక్కలి: ఆదీఆంధ్రా వీధి సమీపంలో కింజరాపు ఎర్రన్నాయుడు పార్క్‌ను బుధవారం ఉద్యాన వన, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామపంచాయతీ అధికారులు, టీడీపీ శ్రేణులు పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పార్క్ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మూలకు చేరిన ఫౌంటైన్, పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. పార్కు అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి సంబంధిత శాఖల అధికారులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మామిడి రాము, కోళ్ల లవకుమార్, కామేసు, ప్రసాద్‌రెడ్డి, ప్రఫుల్లా, దుర్గారావు, వినాయకరావు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం స్వదేశీ సహకార సంఘ కార్యవర్గం ఎన్నిక

సంతబొమ్మాళి: సీతానగరం స్వదేశ మత్స్యకార సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం నరసన్నపేట మత్స్యశాఖ ఎఫ్‌డీవో సురేష్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా టీడీపీ యువనేత వాడరేవు కృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా బచ్చల చిన బాబు, కార్యదర్శిగా బచ్చల బహ్మానందంతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షు డిగా ఎన్నికైన వాడరేవు కృష్ణారావు మాట్లాడుతూ మంత్రి అచ్చెన్నాయుడు సహకారంలో మత్స్య కారుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తా నన్నారు.

నేడు మంత్రి అచ్చెన్నాయుడు టెక్కలి రాక

టెక్కలి: రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం టెక్కలిలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి తెలిపారు. ఉదయం 9 గంటలకు కండ్రవీధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి హాజరవుతారన్నారు. అనం తరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ, ఉదయం 10.30 గంటలకు టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో జరుగు ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి సమా వేశంలో పాల్గొంటారన్నారు.

స్త్రీనిధి రుణాలతో మహిళలకు భరోసా

హరిపురం: ప్రభుత్వం అందజేస్తున్న స్త్రీనిధి రుణాలతో మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తుం దని ఏపీఎం జి.ప్రసాదరావు అన్నారు. అంబుగాం గ్రామంలో బుధవారం మహిళా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి సంఘానికి రూ.5 లక్షల వరకు రుణం అందజేయనున్నట్లు తెలిపారు. బ్యాంకు లింకేజీ రుణాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ స్త్రీనిధి రుణాలను తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్య క్రమంలో స్త్రీనిధి మేనేజర్ సాయిరాం, వీవోఏ చంద్రావతి పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

మెళియాపుట్టి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని టెక్కలి డీఎల్పీవో ఐవీ రమణ అన్నారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఇళ్లనుంచి సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. కాలువలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కరరావు, ఏవో పట్నాయక్ పాల్గొన్నారు.

హెచరీ ఆక్రమణల ఫిర్యాదుపై అధికారుల విచారణ

సంతబొమ్మాళి: పాతమేఘవరంలో ఉన్న రొయ్యల హెచరీ యాజయాన్యం ప్రభుత్వ భూము లను ఆక్రమించిందని టీడీపీ మత్స్యకార నాయకుడు సూరాడ ధనరాజ్ ఇచ్చిన ఫిర్యాదుపై రెవె న్యూ అధికారులు బుధవారం విచారణ చేశారు. మండల రెవెన్యూ అధికారి లక్ష్మీప్రసన్న, వీఆర్వో సాయి, సర్వేయర్ శివాజీ గ్రామానికి వెళ్లి విచారించారు. గతంలో టెక్కలి ఆర్డీవోగా పని చేసిన కిషోర్ ఆధ్వర్యంలో డిజిటల్ సర్వే చేపట్టి ఇచ్చిన మ్యాప్ ప్రకారమే నిర్మాణాలున్నాయని వాటి రికార్డులను హెచరీ యాజమాని రవికిరణ్ అధికారులకు చూపించారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

3న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

మబగాం(పోలాకి): గతంలో దివ్యాంగుల శిబిరాల ద్వారా గుర్తించిన దివ్యాంగులకు ఆగస్టు 3న నరసన్నపేటలో ఉపకరణాలు పంపిణీ చేస్తామని సంబంధిత విభాగం ప్రత్యేకాధికారి కె.కవిత తెలిపారు. బుధవారం ఆమె మబగాంలోని ఎమ్మెల్యే రమణమూర్తిని కలిసి మాట్లాడారు. దివ్యాంగులకు సమాచారమివ్వాలని ఎంపీడీవోలకు సూచించామన్నారు.

కాశీబుగ్గ డీఎస్పీగా శ్రీనివాసరావు

పలాస: కాశీబుగ్గ డీఎస్పీగా పాత్రుని శ్రీని వాసరావును నియమిస్తూ ప్రభుత్వం బుధ వారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గుంటూరు డీసీఆర్‌పీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తు ఇక్కడికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం కాశీబుగ్గ డీఎస్పీగా పనిచేస్తున్న నాగేశ్వర రెడ్డికి డీజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు అందాయి.

గొదలాంలో ఉచిత వైద్యశిబిరం

సంతబొమ్మాళి: మండలంలోని గొదలాంలో ఉచిత వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో రోగులకు వైద్యులు బీపీ, సుగర్ పరీక్షలతో పాటు ఇతర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పాలిన వసంతరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల

- పెచ్చులూడుతున్న శ్లాబ్
- తడిసిపోతున్న మందులు, రికార్డులు
- ఇబ్బందిపడుతున్న పాడి రైతులు, సిబ్బంది

లావేరు: మండలం బుడుమూరు వద్దగల పశు వైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. దీంతో అక్కడ పనిచేసే సిబ్బందికి కార్యాలయ నిర్వాహణకు నానా అవస్థలు పడుతున్నారు. కార్యాలయం పైకప్పు పెచ్చులూడి పోవడంతో వర్షం కురిస్తే చాలు నీరుకారి మందులు, రికార్డులు తడిసిపోతున్నాయి. దీంతో ఆసుపత్రికి వస్తున్న పాడి రైతులు ఇబ్బందిపడుతున్నారు. అలాగే పైకప్పు పెచ్చులూడడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని అక్కడి పనిచేస్తున్న పశువైద్య సిబ్బంది భయాందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోనే అత్యాధికంగా పాల సేకరణ ఈ గ్రామం నుంచే జరుగుతుంది. ఈ రకంగా గ్రామంలో ఎక్కువ మంది పాడి రైతులు ఉన్నారు. అలాగే ఇక్కడి పశువైద్య శాలకు రహదారి సదుపాయం కూడా లేక పోవడంతో పశువైద్య శాలకు వెళ్లాలంటే డొంకల్లో నుంచి పాములకు భయడుతూ తమ పశువులను తీసుకుని పశు వైద్య శాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా సరే స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు స్పం దించి శిథిలమైన పశువైద్యశాలకు మరమ్మతు పనులు చేపట్టడంతో పాటు రహదారి సదుపాయాన్ని కల్పించాలని స్థానిక పాడి రైతులు కోరుతున్నారు.


శిథిలావస్థలో బుడుమూరు పశు వైద్యశాల
డొంకలతో పూడికపోయిన రహదారి

జీడిపిక్కల ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

టెక్కలి: నౌపడా-మెళియాపుట్టి రోడ్డు లక్ష్మీగణేష్ ట్రేడర్స్ జీడిపిక్కల ఫ్యాక్టరీలో బుధవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిన ప్రమాదంలో రూ.5 లక్షల నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపకశాఖ అధికారి బి.సూర్యారావు తెలిపారు. గురువారం ఉదయం 5 గంటల తరువాత అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని, లోపల బోయిల్డ్ జీడిపిక్కల సరుకు ఈ మంటల్లో కాలిపోయింది. మంటలు వ్యాపించడంతో స్థానికులు గుర్తించి యజమాని సానా చిట్టికుమార్‌కు సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరు కొని మంటలను అదుపులోకి తెచ్చారు. లోపల నుంచి పొగలు కమ్ముకు రావడంతో ఫైర్ సిబ్బంది దుర్గారావు, బాలాజీ, చిన్నారావు, రాము, శ్రీనివాసరావు తదితరులు ఇబ్బందులు పడ్డారు.

బోర్ మెకానిక్ నివాసంలో చోరీ

టెక్కలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం రోడ్డులో నివాసం ఉంటున్న బోర్ మెకానిక్ ఎం.డిల్లేశ్వరరావు నివాసంలో మంగళవారం చోరీ జరిగింది. ఇంటి తలుపులు బలవంతంగా తెరిచి బీరువాలో ఉన్న అర తులం బంగారు, రూ.7 వేల నగదు, మూడు జతల పట్టీలు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. ఘటనా ప్రాంతాన్ని సీఐ షైడయ్య బుధవారం పరిశీలించారు. అయితే యజమాని డిల్లేశ్వరరావు ఫిర్యాదు చేయకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు.

బెల్లం ఊటలు ధ్వంసం

హరిపురం: మందస మండలం కొండలోగాం గ్రామంలో బుధవారం సెబ్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ జైభీమ్ ఆధ్వర్యంలో 1300 లీటర్ల బెల్లం ఊటలు, 25 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలతో సారా నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొండలు, లోయల్లో సారా తయారీని అడ్డుకొని అక్రమ రవాణాపై దృష్టి సారిస్తామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది కాంతారావు, శాంతారావు, నాయుడు తదిరతులు పాల్గొన్నారు.

బట్టేరులో ఇసుక లారీ పట్టివేత

శ్రీకాకుళం రూరల్: బట్టేరు గ్రామ పరిధి నాగావళి నది నుంచి లారీలో ఇసుక అక్రమ రవాణా చేస్తుండగ.. వీఆర్వోల బృందం పట్టుకుంది. కొత్త విధానం వచ్చేంత వరకు ఇసుక తవ్వకాలు చేపట్టొద్దని ఆర్డీవో ఆదేశాల మేరకు వీఆర్వోలతో ఓ బృందం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 6 గంటలకు వీఆర్వోల బృందం నదీ తీర ప్రాంతంలో పర్యటించారు. ఈ క్రమంలో బట్టేరు నుంచి విశాఖకు లారీలో ఇసుక తరలిస్తుండడంతో అడ్డుకుని రూరల్ పోలీసులకు అప్పగించి, మైన్స్ అధికారులకు సమాచారం అందించారు. పొన్నాం వీఆర్వో గణేష్ ప్రసాద్, నైర వీఆర్వో యశ్వంత్, భైరి వీఆర్వో లక్ష్మణరావు, కరజాడ వీఆర్వో పాపారావు తదితరులు పాల్గొన్నారు.

1996 క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేయండి

పొందూరు: గతంలో రాష్ట్ర ప్రభుత్వం 1996లో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం జరిగేలా చూడాలని డీటీఎఫ్ ప్రతినిధులను క్వాలిఫైడ్ అభ్యర్థుల సంఘం కోరింది. ఈమేరకు బుధవారం క్వాలిఫైడ్ అభ్యర్థులు తాడివలసలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రశన్నకు వినతిపత్రం అందించారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలన్నారు. ఈ సమస్యను రాష్ట్ర డీటీఎఫ్ నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి న్యాయం జరిగేలా చూస్తామని హరిప్రశన్న హామీ ఇచ్చారు.


డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

వైభవంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆషాడ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ అనివెట్టి మండపంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ, తదితరులు పాల్గొన్నారు.


ఆదిత్యునికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

డెత్ రిలీఫ్ ఫండ్ అందజేత

శ్రీకాకుళం క్రైం: నగరంలోని రెండో పట్టణ పోలీసు స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్.మాధవరావు అనారోగ్యంతో మంగళవారం మరణించాడు. ఈ మేరకు మండలవీధిలో ఉన్న అతని కుటుంబ సభ్యులకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం తక్షణ సహాయం కింద డెత్ రిలీఫ్ ఫండ్ రూ.లక్ష చెక్‌ను పోలీసు అసోసియేషన్ సభ్యుల ద్వారా అందజేశారు. ముందుగా మాధవ్ భౌతికకాయానికి వారు నివాళులర్పించి, అతని తల్లి హేమవతికి ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర పోలీసు అసోసియేషన్ సభ్యులు కె.రాధాకృష్ణ, అరుణ కుమారి, జిల్లా సభ్యులు రోణంకి కృష్ణంనాయుడు, కె.భుజంగరావు, నర్సింహులు, జగదాంబ తదితరులు ఉన్నారు.

బీజేపీ నేత వేణుగోపాలంకు మాతృవియోగం

ఎచ్చెర్ల: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం మాతృమూర్తి పైడి అమ్మాయమ్మ బుధవారం కన్నుమూశారు. గడిచిన కొద్ది నెలల నుంచి శతాధిక వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) సమాచారం తెలుసుకుని ఫరీద్‌పేటకు చేరుకుని సంతాపాన్ని వ్యక్తం చేసి అమ్మాయమ్మ భౌతిక గాయం వద్ద నివాళులర్పించారు. అదేవిధంగా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, టీడీపీ నాయకులు చౌదరి నారాయణమూర్తి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, బీజేపీ నేతలు ఆట్లాడ రవిబాబ్జీ, పాతిన గడ్డెయ్య తదితరులు పరామర్శించారు.


అమ్మాయమ్మ(ఫైల్)

ఇండియన్ అకాడమీ సైన్సెస్ కార్యక్రమాలపై నిషేధం

గుజరాతీపేట: స్థానిక ప్రభుత్వ పురుషుల (ఆర్ట్స్) కళాశాలలో ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (బెంగళూరు) సహకారంతో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో ధనాన్ని వృథా చేస్తున్నట్టు గుర్తించడంతో ఐదేళ్లపాటు నిషేధిస్తున్నట్టు ఆ సంస్థ నుంచి ఉత్తర్వులు అందాయి. వివరాల్లోకి వెళ్తే.. 2022 మార్చి 14 నుంచి 27వ తేదీ మధ్య ఇండియన్ అకడమిక్ సైన్సెస్ సహకారంతో కాంప్లెక్సిటీ, ఎవల్యూషన్ ఆఫ్ లివింగ్ అనే అంశంపై రిఫ్రెషర్ కోర్సుకు నిధులు మంజూరు చేశారు. ఆ కార్యక్రమం నిర్వహించలేదని అప్పటి విద్యాశాఖ మంత్రికి, ప్రిన్సిపల్ సెక్రటరీకు, కమిషనర్‌కు అక్కడి సిబ్బంది ఫిర్యాదు చేశారు. అయితే కార్యక్రమం నిర్వహించకుండా నిధులు డ్రా చేసినట్లు పరిశీలనలో తేలింది. అప్పటి ప్రిన్సిపాల్ పి.సురేఖ అవినీతికి కార్యక్రమాలకు పాల్పడుతోందని, సైన్స్ అకాడమి, డీబీటీ నుంచి అనేక నిధులు మంజూరు చేయించుకుని దుర్వినియోగం చేస్తున్నట్టు అప్పటి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం నుంచి వెళ్లిన ఫిర్యాదు వివరాల మేరకు ఇక్కడి కోర్సు కో ఆర్డినేటర్‌కు వివరణ ఇవ్వాలని ఉత్తర్వులు రాగా, తను కోర్సు నిర్వహణ మాత్రమే చేస్తానని, ఆర్థిక లావాదేవీలు, ఇతర విషయాలు ప్రిన్సిపాల్ చూస్తున్నారని 2023 డిసెంబరులో సమాధానం ఇచ్చారు. విచారణ తర్వాత రూ.9,89,679 అవినీతి జరిగిందని రుజువు కావడంతో వెంటే ఆరు శాతం వడ్డీతో ఆ మొత్తాన్ని చెల్లించాలని ఉత్వర్వుల్లో పేర్కొన్నారు.

జీవో85పై పునరాలోచన చేయాలి

జి.సిగడాం: జీవో నెం.85పై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని ప్రభుత్వ వైద్యుల సంఘ నాయకులు బుధవారం రణస్థలం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్)కి వినతి పత్రం అందచేశారు. ప్రభుత్వ వైద్యుల పీజీ ప్రవేశం కొరకు తెచ్చిన ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ విడుదల చేసిన ఈ జీవో సరికాదన్నారు. వైద్యాధికారులు శర్మ, జనార్దన్, కృష్ణచైతన్య, యమునా, గంగా ప్రియదర్శిని, మౌనిక, మణిభూషణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడిగా గురుదేవ్

గార: కళింగపట్నంలో ఇన్లాండ్ మెరైన్ ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడిగా బెనియా గురుదేవ్ బుధవారం ఎన్నికయ్యారు. వీరిని కళింగపట్నం మాజీ సర్పంచ్ పొట్నూరు కృష్ణమూర్తి కలిసి అభినందనలు తెలిపారు.



సుందర శ్రీకాకుళం నిర్మాణమే లక్ష్యం


రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: శ్రీకాకుళం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం ఆయన నగరంలోని 10, 30, 33, 44 డివిజన్లలో రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నగరవాసులు మౌలిక సదుపాయాలకు కూడా నోచుకోలేదని తెలిపారు. నగరంలోని అనేక రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏనాడూ అభివృద్ధిపై దృష్టి సారించలేదన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ కార్పొరేషన్‌గా తయారుచేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు నగర పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నగర కమిషనర్ చల్లా ఓబులేసు, రెడ్డి గిరిజా శంకర్, టీడీపీ నాయకులు, డివిజన్ ఇన్‌చార్జీలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కంచిలి సమస్యలు మంత్రి దృష్టికి

కంచిలి: మండలంలో ప్రధాన సమస్యలను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి టీడీపీ నాయకులు తీసుకెళ్లారు. బుధవారం మర్యాదపూర్వకంగా మంత్రిని కిలిసి వినతి పత్రాన్ని అందజేసి సమస్యలు వివరించారు. ఎరువుల కొరతలేకుండా చేయాలని, సోంపేట డయాలసిస్ కేంద్రాలు పెంచాలని, డయాలసిస్ కేంద్రంలో డయాలసిస్ మిషన్ల సంఖ్య పెంచాలని కోరారు. కార్యక్రమంలో కంచిలి మండల నాయకులు పాల్గొన్నారు.


మంత్రికి వినతి పత్రాన్ని అందిస్తున్న నాయకులు

పేదలందరికీ సౌకర్యవంతమైన ఇళ్లు

అరసవల్లి: పేదలందరికీ సౌకర్యవంతమైన ఇళ్ల నిర్మాణమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం పేదలందరికీ రాష్ట్ర వ్యాప్తంగా 30లక్షల ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి.. చివరకు ఇంటికోసం ఒక సెంటు స్థలం మాత్రమే కేటాయించి, ఈ ఐదేళ్లలో కనీసం 30వేల గృహాలను కూడా నిర్మించలేకపోయారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం పట్టణ పేదలకు రెండేసి సెంట్ల స్థలం, రూ.4 లక్షలు, గ్రామాల్లోని పేదలకు మూడేసి సెంట్ల స్థలం, రూ.4లక్షలు చొప్పున నిర్మాణానికి ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే గత ప్రభుత్వం మధ్యలోనే నిలిపేసిన నిర్మాణాలను పూర్తి చేస్తామని, అలాగే పెండింగ్ బిల్లును కూడా చెల్లిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు, సామాజిక పింఛన్లు అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఐదు కీలక హామీలను అమలు చేశారన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరమణ టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి శివాల బాబూ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట

చేపల చెరువుల లీజ్‌పై వాదోపవాదనలు

- ఓపెన్ ఆక్షన్‌కు వైసీపీ పట్టు..
- పాతవారికే కేటాయించాలని టీడీపీ.. అనంతరం వాకౌట్

ఇచ్ఛాపురం: మున్సిపాల్టీ పరిధిలోని ఐదు చేపల చెరువుల లీజ్ విషయంలో కౌన్సిల్ సమావేశంలో సభ్యుల మధ్య వాదోపవాదనలు జరిగాయి. చేపల లీజులు ఓపెన్ ఆక్షన్ వేయాలని వైసీపీకి చెందిన వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతి దివ్య, లాబాల స్వర్ణమణిలతో పాటు కౌన్సిలర్లు పట్టుపట్టగా.. పాత వారికే చేపల లీజులు రెన్యువల్ చేయాలని టీడీపీ కౌన్సిలర్లు పట్టుబట్టారు. దీంతో టీడీపీ-వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. బుధవారం చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ, అత్యవసర సమావేశం జరిగింది. అజెండాలోని 16అంశాలపై చర్చ చేపట్టారు. చేపల చేరువుల విషయంలో వైస్‌చైర్‌పర్సన్ లాబాల స్వర్ణమణి అభ్యంతరం వ్యక్తం చేసి డీసెంట్ అందివ్వగా, ప్రజామరుగుదొడ్ల పునః నిర్మాణం అంశాన్ని వాయిదా వేసి మిగిలిన అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. చెరువుల కేటాయింపుపై చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ఓటింగ్ పెట్టగా.. అధికార పార్టీ కౌన్సిలర్లు ఆక్షన్ పెట్టాలని చేతులు ఎత్తగా, టీడీపీ కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, కాళ్ల వెంకటలక్ష్మి, పత్రి తవిటయ్య, ఆశి లీలారాణి, గేదెల శేఖర్, నారాయణ బెహరా వాకౌట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్లు

వంతెన నిర్మాణం పనులు పూర్తి చేయాలి

గార: వంశధార నదిపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణం పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి గార పంచాయతీ మాజీ సర్పంచ్ బడగల వెంకట అప్పారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభం చేసి చాలా వరకు నిర్మాణం పనులు పూర్తయినా, తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ఈ వంతెన నిర్మాణం పూర్తి చేస్తే సుమారు 50 కిలోమీటర్లు పొడవునా సముద్ర తీర గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కలిసి కోరామన్నారు.

జిల్లా సమాచార హక్కు చట్టం పోరాట కమిటీ యూత్‌వింగ్ అధ్యక్షుడిగా బాలరాజు

లావేరు: శ్రీకాకుళం జిల్లా సమాచార హక్కుచట్ట న్యాయ పోరాట సమన్వయ కమిటీ యూత్ వింగ్ ప్రెసిడెంట్‌గా వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ గ్రామానికి చెందిన నందుపల్లి బాలరాజు ఎంపికైనట్టు ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ చైర్మన్ కంచర్ల సురేష్ వద్ద నుంచి బుధవారం ఉత్తర్వులు వచ్చినట్టు ఆయన తెలిపారు. బాలరాజు ఇది వరకు వజ్రపుకొత్తూరు మండల సమాచార హక్కు చట్టం అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఎంపికైన బాలరాజు మాట్లాడుతూ.. నాకు ఈ అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షుడు అప్పన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.సురేష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిన జగన్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మాజీ సీఎం జగన్‌రెడ్డి భ్రష్టు పట్టించారని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తొగరాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు ఎంతో మంది ఉన్నత స్థాయికి చేరుకున్నారన్నారు. గత వైకాపా పాలనలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో వివిధ రకాల యాప్‌లను ప్రవేశపెట్టి విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సుజాత అమర్‌నాథ్, నూకరాజు, అన్నెపు భాస్కరరావు, బోర గోవిందరావు, రెడ్డి రాంబాబు, సర్పంచ్‌లు గౌరీ పతేశ్వరరావు, సత్తిరాజు, లక్ష్మీ పాల్గొన్నారు.

ఒలింపిక్ విజేత బాకర్‌కు సైకత శుభాకాంక్షలు



ఆమదాలవలస: ఈ ఏడాది ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఒలింపిక్ క్రీడల్లో దేశం తరపున పాల్గొని కాంస్య పతాకం సాధించిన షూటర్ మనుబాకర్‌కు సైకత శిల్పి గేదెల హరికృష్ణ.. సైకత శిల్పాన్ని వేసి శుభాకాంక్షలు తెలిపారు. గాజులకొల్లివలస దగ్గరలోని సంగమేశ్వరస్వామి కొండ దిగువున వేసిన ఈ సైకత శిల్పాన్ని అధిక సంఖ్యలో తిలకించి హరికృష్ణను అభినందించారు.

పిల్లల సంరక్షణ మనందరి బాధ్యత

గుజరాతీపేట: పిల్లల సంరక్షణలో మనందరి బాధ్యతని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక న్యాయ సేవా సందన్‌లో పోలీసు అధికారులతో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. పిల్లల సంరక్షణలో పోలీసులదే ప్రధాన పాత్ర ఉంటుందన్నారు. పిల్లలపై అన్యాయాలకు తగు చర్యలు తీసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, డీసీపీవో రమణ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

జనసేన పార్టీ సభ్యత్వ నమోదుకు తరలిరావాలి

సరుబుజ్జిలి: జనసేన పార్టీ సభ్యత్వ నమోదుకు ప్రజలు తరలిరావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో జనసేన సభ్యత్వ నమోదు పార్టీ మండల అధ్యక్షుడు పైడి మురళీమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రూ.500తో సభ్యత్వం తీసుకుంటే గుర్తింపు కార్డు, ఐదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తులగాపు ధనుంజయరావు, తేజేశ్వరరావు, సతివాడ రామకృష్ణ, మిన్నారావు, అన్నంనాయుడు, జనసైనికులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటా: ఎన్ఈఆర్

రణస్థలం: పేద విద్యార్థుల అభ్యున్నతకు కూటమి ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. బుధవారం కొండములగాం ప్రభుత్వం జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, దన్నాన సత్తిబాబు, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు

ఎచ్చెర్ల: స్థాని బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వర్సిటీ వీసీ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీలోని మహేంద్రతనయ వసతి గృహంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బిడ్డికి అడ్డయ్య, ఓఎస్‌డీ యు.కావ్య జ్యోత్స్న, ప్రధానాచార్యులు ఎస్.ఉదయ్‌భాస్కర్, చీఫ్ వార్డెన్ లోకేశ్వరి, సీహెచ్ రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు సమాజ సేవకుల పేర్లుపై హర్షం

లావేరు: ప్రభుత్వ పథకాలకు సమాజ సేవకులు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తల పేర్లు పెట్టడం హర్షనీయమని టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ప్రధాన కార్యదర్శి పిన్నింటి మధుబాబు అన్నారు. లావేరులో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ తన పేరుతో ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తే.. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేక సమాజానికి సేవలు చేసిన వారి పేర్లు పెట్టడం ఎంతో శుభపరినా మమన్నారు. ఉన్నతమైన వ్యక్తులకు ఉన్నత స్థానం ఇస్తే ఉన్నత మైన ఆలోచనలు ఉంటాయన్నారు. ఎచ్చెర్ల మాజీ ఏఎంసీ చైర్మన్ ఐ.తోటయ్యదొర, టీడీపీ నాయకులు లంకలపల్లి శ్రీనివాసరావు, నల్లి లక్ష్మనాయుడు, పండి గోపాలరావు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

శ్రీకాకుళం క్రైం: ఉద్యోగ నిర్వాహణలో ప్రజలకు అందించిన సేవలే గుర్తింపునిస్తాయని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా పోలీసు శాఖలో ఏఎస్పీగా విధులు నిర్వహించిన వి.ఉమామహేశ్వరరావు బుధవారం పదవీ విరమణ చేయడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో సన్మాన కార్యాక్రమాన్ని నిర్వహించారు ఏఎస్పీని సతీసమేతంగా సత్కరించారు. అలాగే పదవి విరమణ చేసిన ఎస్ఐలు వెంకటరావు, ఎం.కోటేశ్వరరావు, పి.శ్యామలరావు, కె.రమేష్‌బాబు, ఏఎస్ఐ ఎస్.ఆనందరావు, క్లాస్ ఫోర్ ఉద్యోగి టి.సూర్యనారాయణలను కూడా ఎస్పీ దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పోలీసు శాఖ ఎప్పుడు అండగా ఉంటుందని ఎస్పీ తెలిపారు.

టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుజరాతీపేట: ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో కె.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అడ్మిషన్స్ కోసం ఈ నెల 31వ తేదీన ప్రారంభం తేదీ కాగా, అడ్మిషన్లను ఆన్‌లైన్ చేసేందుకు ఆగస్టు 28 చివరి తేదీ అని, ఆగస్టు 28న ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, రూ.200 అపరాధ రుసంతో దరఖాస్తును నవంబరు 4వ తేదీలోగా ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చునన్నారు. ఓపెన్ స్కూల్ దరఖాస్తును ఆన్‌లైన్ చేయించుకున్న తర్వాత రిఫరెన్స్ నెంబర్ ఆధారంగా ఫీజు కట్టుకోవాలన్నారు.

హెల్త్‌కోర్సుల్లో ప్రవేశాలకు..

ఎచ్చెర్ల: స్థానిక బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, బొలినేని మెడిస్కిల్స్ జెమ్స్ రాగోలు సంయుక్తంగా నిర్వహిస్తున్న హెల్త్‌కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ ప్రిన్సిపాల్ ఎం.అనురాధ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. రెండేళ్ల వ్యవధి గల మాస్టర్ ఆఫ్ హెల్త్‌కేర్ అడ్మిని స్ట్రేషన్‌లో 40, పీజీ డిప్లమా ఇన్ రికార్డ్స్ అండ్ హెల్త్ ఇన్ఫర్మేషన్‌లో 40 సీట్లు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులై 20 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు గల వారు కోర్సుకు అర్హులన్నారు.

శతశాతం పంపిణీ చేయాలి

ఇచ్ఛాపురం: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ ఒక్కరోజులోనే శతశాతం పూర్తి చేయాలలని ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ అధికారులకు సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది సమీక్షించారు. ఉదయం 6.30 గంటలకే తప్పనిసరిగా పింఛన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. పింఛన్ల పంపిణీ చేసే సిబ్బంది ముందురోజే వర్కింగ్ ప్లేస్‌లో స్టే చేయాలని ఆదేశించారు. డీటీ గురు ప్రసాద్, ఏపీఎం ప్రసాద్ తదితరులుపాల్గొన్నారు.

పాసింజర్ ట్రైన్లు నిలుపుదల చేయాలి

సోంపేట: బారువ రైల్వేస్టేషన్‌లో పాసింజర్ ట్రైన్ హాల్ట్ ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడికి బారువ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మద్దు కూమార్ కోరారు. ఈమేరకు ఢిల్లీలో బుధవారం వినతి పత్రం సమర్పించారు. అలాగే బారువలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి, బారువ సముద్ర తీరంలో పర్యాటక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు.

ఎస్ఎంసీలు ఏర్పాటు చేయాలి

కంచిలి: రాష్ట్రంలో ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలు కాకుండా ఇతర పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు (ఎస్ఎంసీ) ఏర్పాటు చేయాలని ఎంఈవో శివరాం ప్రసాద్, చిట్టిబాబు అన్నారు. బుధవారం ఎంఈవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ కోసం 50శాతం మంది తల్లిదండ్రులు హాజరు కావాలి, కోరం ఏర్పడటానికి సమయ పరిమితిని హెడ్ మాస్టర్ నిర్ణయిస్తారన్నారు. ఎన్నికలు సాధారణంగా చేతులు చూపించి లేదా వాయిస్ ఓటు ద్వారా నిర్వహించబడతాయన్నారు. వివాదాల అసాధారణ పరిస్థితుల్లో రహస్య బ్యాలెట్ విధానాన్ని అవలంబివచ్చన్నారు. ఎస్ఎంసీ పేరెంట్ లేదా గార్డెయిన్ రిప్రజెంటేషన్ ఎన్నికల కోసం తల్లిదండ్రులలో ఒకరు మాత్రమే ఓటు వేయటానికి అర్హులన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ దాని ఎన్నికైన సభ్యులు నుంచి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవటం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యులు, హెచ్‌ఎంలు, ఇన్‌చార్జీలు ఎన్నికల్లో పాల్గొనటానికి అనర్హులని తెలిపారు.

పశువులకు టీకాలు

ఆమదాలవలస: పశువుల్లో ముద్దచర్మ వ్యాధులు రాకుండా ఈ నెల 20వ తేదీన ఆగస్టు 18 వరకు వ్యాధి నిరోధకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సిబ్బంది అందరూ పాల్గొనాలని ప్రాంతీయ పశువైద్యశాఖ సహాయక సంచాలకులు ఆర్.ఆనందరావు సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆమదాలవలస, ఎచ్చెర్ల మండలాల్లో సుమారు 23 వేల డోసులు టీకాలు ఈ నెల 20వ తేదీ నుంచి వేస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో పశువైద్య సిబ్బంది ముందస్తుగా దండోరాలు వేయించి విజయవంతం చేయాలన్నారు.

విద్యుత్ స్తంభాన్ని మార్చండి

గార: కళింగపట్నం పంచాయతీ శిలగాం గ్రామంలో దశాబ్దాల కిందట వేసిన విద్యుత్ స్తంభం బీటలు వారిపోయిందని, వెంటనే కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని కళింగపట్నం టీడీపీ నాయకులు తాళ్లూరి శివ నరసింహ ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఈ విషయాన్ని ఇటీవల ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు.

సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల: అంబేడ్కర్ వర్సిటీలో ఇంజనీరింగ్ నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు 325 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆరో సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఎగ్జామినేషన్ డీన్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. 13వ వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సోంపేట: విద్యార్థి దశనుంచే యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బారువ ఏఎస్ఐ కోడ కృష్ణారావు వివరించారు. కొర్లాంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం దృష్టికి సమస్యలు

ఇచ్ఛాపురం: రెండేళ్లు గడుస్తున్నా మాకు జీతాలు అందటం లేదని ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజుకు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి జీతాలు అందేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుధ్య మంత్రిత్వ శాఖలో నడుస్తున్న (సీపీడబ్ల్యూ ఎస్) సమగ్ర రక్షిత తాగునీటి సరఫరా విభాగాల్లో పనిచేస్తు న్న థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలైనా ఈపీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, వేతనం నేరుగా బ్యాంక్ అకౌంట్‌లో జమయ్యేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘ అధ్యక్షుడు నీలాచలం, కార్యదర్శి జోగారావు, వైకుంఠరావు, కేశవరావు, రాఘవులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జి.సిగడాం: గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జి.సిగడాం వైద్యాధికారిణి సుమబిందు అన్నారు. బుధవారం మెట్టవలసలో సీజనల్ వ్యాధులపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రోగుల పరిస్థితిపై ఆరా తీయబంతో పాటు సర్వే చేపట్టారు. ఆమె మాట్లాడుతూ చికన్‌గున్యా, డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా ఇతర వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. సర్పంచ్ కామోజుల అరుద్ర, ఎంపీటీసీ బెవర లక్ష్మీ, నాయకులు కామోజులు సీతారాం, బెవర జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శి సతీష్, ఎల్‌టీ జద్దు శేఖర్, సిబ్బంది రిజియారాణి ఉన్నారు.